# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీనివాసరావు అయినాపురపు.

## గురువు సన్నిధిలో ...

**ఓం అస్మద్గురుభ్యోనమ:** స్వాతి చినుకులు పడేవి ఎన్నెన్నో! వాటిలో ముత్యపు చిప్పలలో పడేవి ఎన్ని? ముత్యములుగా మారేవి ఎన్ని? వాటిలో సద్వినియోగం కాబడేవి ఎన్ని? మానవ జీవితాలూ అంతేనేమో! జలపాతంలో ఒక చిన్న తుంపర అంతే! మనకి తారసపడనంతవరకు చాలా విషయాలు నమ్మశక్యంగా ఉండవు. మనకే ఆ అనుభవం ఎదురైతే - మనసు పొందే ఆనందం ఎంతని చెప్పగలం. ఇదీ అలాంటి సంఘటన.

అది 2003 వ సంవత్సరము, జులై 1 వ తారీఖు. తీర్థగోష్ఠికై భగవద్బంధువు శ్రీ హరిగారి ఇంటికి శ్రావ్య, నేనూ వెళ్ళాం. చినజీయరు స్వామివారి దృష్టి నా చెవులపై పడింది. "చక్కగా ఉన్నాయి. ఎప్పుడు కుట్టించారు?" అని అడిగారు. ఊహించని ప్రశ్న! కొన్ని నెలలకు ముందే కుట్టించానన్న విషయము చెప్పాను. తరువాత నా తల్లిదండ్రుల గురించి, కుటుంబసభ్యులను గురించి, నా పేరు, ఊరు, ఉద్యోగ విషయాలు అడిగి, "నాతోపాటు చికాగో సమ్మర్ క్యాంప్‌కి వస్తారా?" అని అడిగారు. తటపటాయిస్తూ "ప్రస్తుత పరిస్థితులలో కష్టమేమో" అని నీళ్ళు నములుతుంటే, "ఫ్రీ అడ్మిషన్ ఇస్తాను, ఫ్లైట్ టికెట్ పెట్టుకుని వస్తారా?" అని అడిగారు. [*గురువులు పెట్టే పరీక్షలు ఇలానే ఉంటాయి. ఆ విషయము నాకు క్యాంప్‌కి వెళ్ళి వచ్చాకగాని అవగతమవ్వలేదు.*] నేను నిరుత్తరుడినై నిలుచున్నాను. "సరే. ఆలోచించుకోండి." అని ఆయన దృష్టి వేరే పని మీదకి మరల్చేరు. వెంటనే మురళిగారు పక్కకి పిలిచి "మీరేం ఆలోచించకండి. వస్తున్నానని చెప్పండి. ఫ్లైట్ ఖర్చులకి నేనిస్తాను. తరువాత ఎప్పుడైనా మీరు ఇవ్వవచ్చు"ని, "స్వామివారు అలా ఒకరిని పిలవడం చాలా అరుద"ని అన్నారు. ఒక్క క్షణంలో సవాలక్ష ఆలోచనలు. ఆలోచించి చెప్తానని ఇంటికి వెళ్ళిపోయాను.

> *ఈ మధ్య ఇండియా వెళ్ళినప్పుడు చెవులు కుట్టించుకోవాలని అనిపించింది. ఇదివరకు ఉపనయన సమయములో చెవి పోగులు ధరించడం అనేది చేసేవారు. కాని నేటి ఫేషన్ యుగంలో అన్నిటికీ తిలోదకాలు ఇచ్చేస్తున్నాంకదా! చెవులకు ఆభరణములు, మెడలో ఆభరణములు అనేవి నేడు ఆడువారికి మాత్రమే పరిమితమైపోయాయి. మగవారు ధరిస్తే హేళన చెయ్యడం చూస్తుంటాము. కాని రాజులు చాలామంది ఆభరణములు ధరించడం మనకు తెలిసిన విషయమే! అయితే వాటి ప్రయోజనము ఏమిటి? అని వెదుకుతున్న సమయములో ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ నా దృష్టిని ఆకర్షించాయి. దానిని పరిశీలించగా చెవులు కుట్టించుకోవడమువలన ఒక జ్ఞాననాడి ప్రేరణకు గురి (ఏక్టివేట్) అవుతుందని గ్రహించాను. వెంటనే చెవులు కుట్టించుకోవాలని నిర్ణయం తీసుకున్నాను.*

మా ఆవిడ ఈ క్యాంప్‌కి వెళ్ళడానికే ప్రోత్సహించింది. కాని నేను నిర్ణయించుకోలేక పోతున్నాను. ఇండియా ఫోన్ చేసి మా అమ్మగారిని అడిగాను. ఇంకా చాలామందిని అడిగాను. అందరూ ఒకే మాట "వెళ్ళు. ఇలాంటి అవకాశాన్ని జారవిడుచుకోకు" అని. అర్ధరాత్రి దాటింది. ఆ క్షణంలో ఒకే ఒక్క ఆలోచన! యూనసిమిటి (ఇంతకు

ముందు చూసిన ప్రదేశమే అయినా) వెళ్ళడానికి $400 ఖర్చు పెట్టాను, అదే క్యాంప్‌కి వెళ్ళడానికి డబ్బులు లేకపోయాయి అని ఒక వెక్కిరింపు నాపై నాకే కలిగింది. ఇక 2, 3 తారీఖులలో వెళ్ళాలా? వద్దా? తర్జన భర్జన. చివరకు 3వ తారీఖున Stanford University కి వెళ్ళినప్పుడు మురళీగారు, వారి శ్రీమతి రాధగారు పలుకరించి ఎవరో స్వామీజీ భక్తులు నాకు ఫ్లైట్ టిక్కెట్లకు కూడా ఏర్పాటు చేస్తామన్నారని చెప్పారు. త్వరగా ఫ్లైట్ టిక్కెట్లు రిజర్వ్ చేసికొమ్మని చెప్పారు. ఇక నాన్చడమెందుకని డైరెక్టుగా స్వామీజీనే అడిగాను. "నేనేమీ నిర్ణయించుకోలేకపోతున్నాను. మీరు ఏమి చెప్తే అదే చేస్తాను" అని. "నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే తప్పకుండా రండి" అని చెప్పారు. అదేరోజు టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్నాను. 4, 5 తారీఖులలో యూసమిటీ వెళ్ళి వచ్చి, 6 వ తారీఖు ఉదయాన్నే 6:30కి బయలుదేరి చికాగో వెళ్ళాను.

***ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో తరగతులు నిర్వహింపబడేవి. ఏదైనా ప్రశ్న ఆవిర్భవించడం తరువాయి, మరుసటి రోజు దానికి సమాధానం లభించేది. ఇది ఒకసారి జరిగితే కాకతాళీయమని అనుకునేవాడిని. కాని చాలాసార్లు జరిగింది.***

ఎయిర్‌పోర్ట్‌లో నన్ను రిసీవ్ చేసుకోడానికి ఒకాయన వచ్చారు. క్యాంప్‌కి వెళ్ళేసరికి మధ్యాహ్నం 4:30 అయ్యింది. ఇక అక్కడ ప్రతి ఒక్కరూ నాకు ప్రత్యేకముగా స్వాగతం (స్పెషల్ అటెన్షన్) ఇవ్వడం ఆశ్చర్యం కలిగించింది. నేను వచ్చానా, లేదా అని, నాకు ఉండడానికి వసతి ఏర్పాటు చేసారా లేదా అని, స్వామీజీయే రెండు మూడు సార్లు అడిగారని వాళ్ళు చెప్పడం మరీ ఆశ్చర్యమనిపించింది. ఇక ఆ రోజు నుండి ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో తరగతులు నిర్వహింపబడేవి. ఏదైనా ప్రశ్న ఆవిర్భవించడం తరువాయి, మరుసటి రోజు దానికి సమాధానం లభించేది. ఇది ఒకసారి జరిగితే కాకతాళీయమని అనుకునేవాడిని. కాని చాలాసార్లు జరిగింది.

ఈ సందర్భములో ఒక విషయం చెప్పాలి. నేను ఇండియా వెళ్ళినప్పుడు, తిరుపతిలో ఒక ఆడియో క్యాసెట్ (శ్రీమతి కొండవీటి జ్యోతిర్మయి చౌదరిగారు పాడిన అన్నమాచార్య కీర్తనలు) కొన్నాను. 2003 మార్చిలో యు.ఎస్. వచ్చినప్పుడు నాతోపాటు ఆ క్యాసెట్ తెచ్చుకున్నాను. ఆ తరువాత దాన్ని ఎన్నిసార్లు విన్నానో లెక్కపెట్టలేదు. ఆ మధురమైన కీర్తనలను, శ్రావ్యమైన ఆలాపనను విన్నప్పుడల్లా ఆ గాయని ప్రత్యక్షముగా పాడుతుండగా చూడగలిగితే ఎంత బాగుండును అని అనుకోవడము జరిగేది. అయితే ఈ క్యాంప్‌కి ఆమె రావడము, ఎవరికైనా నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే మధ్య మధ్య అవకాశమున్నప్పుడు నేర్పిస్తానని అనడం, నేను ఉత్సాహంగా నేర్చుకోడానికి సంసిద్ధత తెల్పడం, అలా ఆమెవద్ద ప్రత్యక్షముగా నేర్చుకునే అవకాశము రావడం - సంకల్పబలముకాక మరేమిటి? ఆమె వద్ద అన్నమాచార్య సంకీర్తనలను (నారాయణాయ నమో నమో ... నానాత్మనే నమో నమో, అంతయునీవే హరిపుండరీకాక్ష ... చెంతనాకు నీవే శ్రీ రఘురామా! మొదలైనవి) నేర్చుకునే అవకాశము రావడము భగవదనుగ్రహముగా భావిస్తాను.



*శ్రీమతి కొండవీటి జ్యోతిర్మయి గారితో*

వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) ముగింపు దశకి వస్తున్న కారణాన, ఆ శుక్రవారం (జులై 11వ తేదీన) ప్రతి ఒక్కరూ వాళ్ళు నేర్చుకున్న దానిని 3 నిమిషములలో చెప్పాలని నిర్ణయించారు. నా వంతుగా 'సర్వభూతస్థమాత్మానాం', 'క్రోధాద్భవతి సమ్మోహ:' శ్లోకముల అర్థాన్ని చెప్పదలిచాను. కాని, మురళిగారు అవి స్వామివారు క్యాంప్‌లో చెప్పలేదు కాబట్టి వద్దన్నారు. ఇక తప్పనిసరి పరిస్థితులలో 4వ అధ్యాయము సంక్షిప్త అర్థాన్ని చెప్పాలని నిర్ణయించుకున్నాను. అదేరోజు సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ అనంతరము స్వామీజీ 'క్రోధాత్ భవతి సమ్మోహ:' శ్లోకము అర్థాన్ని విడమర్చి చెప్పారు. నా ఆలోచనలని ఆయన పసిగట్టారా? ఆయన ఆలోచనల వెంట నే పరిగెడుతున్నానా? సమాధానం తెలియని ప్రశ్న!

ఒకరోజు ఉదయాన్నే ఒకాయన (వయస్సు 50 పైనే ఉంటాయి) "ఓంకారము గురించి ఒక శ్లోకం ఉంది భగవద్గీతలో. అది ఏ అధ్యాయంలో ఉంది?" అని అడిగారు. నాకు తెలియదని చెప్పాను. 8 గంటలకి క్లాసు మొదలయ్యింది. స్వామీజీ 'ఓంకారము' గురించి చెప్తూ అది భగవద్గీత 7వ అధ్యాయములో చెప్పబడిందని చెప్పారు. ప్రశ్న అడగకుండానే సమాధానము దొరకడం విశేషమే కదా! ఆ రోజు మధ్యాహ్నం జెనీవా సరస్సులో ఫెర్రీమీద వెళ్తూ పిల్లలు శ్లోకములు, పెద్దలు భజనలు చెప్పడం మొదలుపెట్టారు. క్యాంప్‌లో మొట్టమొదటిసారి కొండవీటి జ్యోతిర్మయిగారి వద్ద సంగీత పాఠం నేర్చుకున్న నేను, 'నారాయణ హరిఓం - హరిఓం హరిఓం - సత్యనారాయణ హరిఓం - హరిఓం హరిఓం' అంటూ భజన పాడాను. పలువురు నా మొదటి ప్రయత్నాన్ని అభినందించారు.



*చినజీయరు స్వామివారితో వేసవి శిబిరానికి హాజరైన వారిలో కొంత మంది భక్తులు.*

ఈ శిబిరములో మేము మాండూక్యోపనిషత్ గురించి, భగవద్గీత కొన్ని శ్లోకముల సారాంశము, వేదశాఖలగురించి, ఏ వేదములో ఏఏ విషయములు పొందుపరచబడినవో, ఎందరెందరు మహర్షులు మనకీ సంపదను అందించారో, ఇంకా ఎన్నెన్నో విషయములను నేర్చుకున్నాము. పతంజలి యోగసూత్రముల గురించి మొదట నేను తెలుసుకున్నది ఇచ్చటనే! శుక్రవారం అందరూ వారు నేర్చుకున్నదాని నుండి విషయములను క్లుప్తముగా 3 నిమిషములు మాట్లాడారు. నా వంతు వచ్చింది. నేను భగవద్గీత 4వ అధ్యాయము సంక్షిప్త అర్థం తెలుగులో చదివాను. చివరిలో 'బ్రహ్మార్పణం బ్రహ్మహవి:' అనే శ్లోకముతో ముగించాను. స్వామీజీ చిరుహాసాన్ని ఆశీర్వాదముగా వ్యక్తీకరించారు. ఈ వేసవి శిబిరానికి వెళ్ళడము వలన నా ఆలోచనాసరళి మారిపోయింది. నేనసరిస్తూవచ్చిన మానవతావిలువలకు మరింతబలము చేకూరింది. నాలో లోపములు నాకే అవగతమయ్యేవి.

*జెనీవా సరస్సులో ఫెర్రీమీద వెళ్తూ పిల్లలు శ్లోకములు, పెద్దలు భజనలు చెప్పడం మొదలుపెట్టారు. క్యాంప్‌లో మొట్టమొదటిసారి కొండవీటి జ్యోతిర్మయిగారి వద్ద సంగీత పాఠం నేర్చుకున్న నేను, 'నారాయణ హరిఓం - హరిఓం హరిఓం - సత్యనారాయణ హరిఓం - హరిఓం హరిఓం' అంటూ భజన పాడాను.*

శనివారం ఉదయం క్విజ్ నిర్వహించారు. పాల్గొనేవారిని 5 గ్రూపులుగా ఏర్పరచి, నారాయణ, వాసుదేవ, అనిరుద్ధ, సంకర్షణ, ప్రద్యుమ్న అని పేర్లు పెట్టారు. మేము నారాయణ గ్రూపులోనున్నాము. క్విజ్ ముందు మేమనుకున్నాము "నారాయణుడు ఆది దైవము కదా! కాబట్టి వాసుదేవ, అనిరుద్ధ, సంకర్షణ మరియు ప్రద్యుమ్న గ్రూపులవారు చివరకు మాకే చెందుతారని, కాబట్టి మేమే గెలుస్తామని". అదే నిజమయ్యింది. గురుపూర్ణిమరోజు "కర్మఫలాన్ని ఫలముగా, హృదయకుసుమాన్ని పుష్పముగా, ఆనందబాష్పములే తోయముగా, నా గురువులను, గురుతుల్యులను స్మరించుకుంటూ, నా శక్తిమేరకు విశ్వకల్యాణము కొఱకు కృషి చేస్తానని విన్నవించుకుంటూ" ఒక చీటీ వ్రాసి, దక్షిణతో కలిపి స్వామి వారికి అందజేసాను. విశాఖపట్నంలో వృద్ధాశ్రమము నిర్మించాలనే సంకల్పమును వారికి విన్నవించుకున్నాను. మీ ప్రయత్నం సఫలమౌతుందని, మీరు ముందు బాగా స్థిరపడండి అని దీవించారు. ఆయన వద్ద సెలవుతీసికొని, ఆ రాత్రి ఒక భక్తురాలి యింట విశ్రమించి, మరుసటిరోజు ఉదయాన్నే విమానాశ్రయమునకు చేరాము.

నేను రిజర్వ్ చేసుకున్న ఫ్లైట్ అయితే సాయంత్రం 8:30కి. అవకాశముంటే ముందే వెళ్ళలనే తపన. వారం రోజులు ఇంటికి, ఇంతికి, పిల్లలకి దూరముగా ఉన్న నేను వారిని చూడాలనే ఆతృతలో ఉన్నాను. అవకాశముంటే ముందే వెళ్ళాలని నాతోపాటు మరో ఇద్దరు ఎదురుచూస్తున్నారు. ఇక ఫ్లైట్ 5 నిమిషములలో బయలుదేరుతుందనగా, ఒకే ఒక్కరికి చోటు ఉన్నదని ఫ్లైట్ స్టాఫ్ అనడముతో నాకు అవకాశము దొరికింది (మిగిలిన ఇద్దరూ భార్యభర్తలు కావడము వలన). మధ్యాహ్నానికి ఇంటికి వచ్చేసాను. అదేరోజు గణపతి సచ్చిదానంద స్వామీజీని కూడా కలిసే భాగ్యం కలిగింది. మరుసటిరోజు ఉండవలసిన ఆయన కార్యక్రమము అనివార్య కారణములవలన రద్దుచేసారు. నేను సాయంత్రం ఫ్లైట్‌కి వచ్చి ఉంటే సచ్చిదానంద స్వామీజీని చూసే అవకాశం కోల్పోయేవాడిని.

తరువాత ఒకసారి 'సంఘమిత్ర' త్రైమాసిక పత్రిక మొదలు పెట్టాలనే నా ఆలోచనని ఆయనకు తెలియజేస్తే, "తప్పకుండా చెయ్యండి. అవసరమైతే భక్తినివేదనలోని ఆర్టికల్స్‌ని కూడా ఉపయోగించుకోవచ్చ"ని అభయమిచ్చారు. ఈ రోజువరకు దానిలోని ఆర్టికల్స్ సమయానికి తగ్గట్టుగా సమకూరుతునే ఉన్నాయి. సంఘమిత్ర మొదలు పెట్టిన 6 నెలలకు, ఉగాది 2005 సంచికకు పనిచేస్తున్న సమయములో, అంతవరకు నేను ఉపయోగిస్తున్న తెలుగు కంపోజింగ్ సాఫ్ట్‌వేర్ పనిచెయ్యడం మానివేసింది. ఏమి చెయ్యాలో తోచలేదు. గురువుల ఆశీస్సులతో మొదలుపెట్టిన ఆ కార్యము అర్ధాంతరముగా ఆగిపోదని నా నమ్మకము. ఆ సమయములో నా అర్ధాంగి అంతకు ముందు 4 నెలల క్రితం కొన్న తెలుగువర్డ్ సాఫ్ట్‌వేర్ గురించి ప్రస్తావిస్తూ, అది ఉపయోగించి చూడరాదూ! అన్నది. చూద్దును కదా! దానిపై 'శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజజీయరు స్వామి వారి మంగళా శాసనములతో..." అని ఉన్నది. ఇక నా ఆనందానికి అవధులు లేవు. ఆ సంచిక మొదటిసారిగా రంగులతో, బొమ్మలతో చక్కగా ఆవిష్కరించబడింది.

ఇది నా అనుభవాల్ని మీతో పంచుకోవాలని చేసిన చిన్న ప్రయత్నము.

సర్వేజనా: సుఖినోభవంతు. **ఓం అస్మద్గురుభ్యోనమ:**